# మునగ

దక్షిణ భారతదేశంలో ఇంటి పెరటిలో పెంచే బహువార్షిక మొక్కగా మునగ ప్రముఖ స్థానాన్ని సంపాదించుకుంది. కానీ ప్రస్తుతం ఏక వార్షిక రకాలు అందుబాటులోకి రావటంతో రైతులు మునగకి ఉన్న మార్కెట్ డిమాండ్‌ని దృష్టిలో ఉంచుకొని వ్యాపార సరళిలో మునగను సాగుచేయుటకు ఉత్సుకత చూపుతున్నారు. మునగలో లేత కాయలనే కాక మునగ ఆకును కూడా కూరగా వాడుతారు. దీని ఆకులలో విటమిన్ బి,సి మరియు కాల్షియం, భాస్వరం, ఖనిజాలు సమృద్ధిగా ఉన్నాయి.  ఆకుల నుంచి తీసిన రసంలో బాక్టీరియా నిరోధక గుణం కలదు. దీనిలో ఔషధ గుణాలు ఉన్న కారణంగా కొన్ని ప్రాంతాలలో ఆకులు గుజ్జును పుండ్లకు పై పూతగా కూడా వాడుతారు.

**వాతావరణం :** $20^0$-$25^0$ సెల్సియస్ ఉష్ణోగ్రత వున్న ప్రాంతాలు అనుకూలం. $40^0$ సెల్సియస్ కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలో పూత రాలిపోతుంది. మంచును, అధిక చలిని తట్టుకోలేదు.

**నేలలు :** అన్ని రకాల నేలలు అనుకూలం. అధిక సేంద్రియ పదార్థాలతో కూడిన ఇసుక నేలలు శ్రేష్ఠం. నేల ఉదజని సూచిక 6.0-7.5 మధ్యన వుంటే మంచిది.

**విత్తే సమయం :** వార్షిక మునగ ఎప్పుడు నాటినా, వేసవి ప్రారంభంలోనే పూతకు వస్తుంది. కాబట్టి ఆగష్టు-సెప్టెంబరు నెలలో గింజలను పాలిథీన్ సంచుల్లో గానీ, నేరుగా పొలంలోగానీ విత్తుకోవాలి. బహువార్షిక రకాలలో కత్తిరింపులను జూన్ రెండవ వారం నుండి ఆగష్టు చివరి వరకు భూమిలో నాటుకోవచ్చు.

**రకాలు :** దేశవాళీ రకాలు ఎక్కువగా సాగులో వున్నాయి. ప్రస్తుతం మన రాష్ట్రంలో జాఫ్నా, పి.కె.యం-1 రకాలు ఎక్కువగా సాగుబడిలో వున్నాయి.

**పి.కె.యం-1 :** వార్షిక రకం. మొక్క 4-6 మీ, ఎత్తు వరకు పెరిగి విత్తిన 160-170 రోజులలో పూతకు వస్తుంది. కాయ పొడవు 65-70 సెం.మీ. కాయబరువు - 150 గ్రా. దిగుబడి : మొక్కకు 33 కిలోలు లేదా 200-225 కాయలు.

**పి.కె.యం-2 :** వార్షిక సంకర రకం. విత్తిన 160-180 రోజులలో పూతకు వస్తుంది. కాయ పొడవు 120-125 సెం.మీ. కాయబరువు - 280 గ్రా. దిగుబడి : మొక్కకు 220 కాయలు.

**జాఫ్నా :** బహువార్షిక రకం. కాయ పొడవు 60-90 సెం.మీ. మెత్తని గుజ్జు, రుచికరంగా ఉంటుంది. రెండో సంవత్సరం నుండి కాపుకు వస్తుంది. దిగుబడి : మొదటి రెండు సంవత్సరాలు సం॥నికి చెట్టుకు 80-90 కాయలను, నాల్గవ సంవత్సరం నుండి సం॥నికి చెట్టుకు 500-600 కాయలను  పొందవచ్చు.

**నేల తయారి :** నేలను 4-5 సార్లు దుక్కి వచ్చే వరకు దున్నాలి.  బహువార్షిక రకాలకు 5×5మీ. దూరం, ఏకవార్షిక రకాలయితే 2.5×2.5 మీ. దూరం వుండాలి. గుంటల పరిమాణం 45×45×45 సెం.మీ. వుండాలి. ప్రతి గుంటకు 10 కిలోల పశువుల ఎరువు మరియు 250 గ్రా. వేపపిండి మరియు సూపర్‌ఫాస్ఫేట్ వేయాలి.

**వ్యాప్తి చేసే విధానం :** బహువార్షిక రకాలను 90-100 సెం.మీ. పొడవు, 5-8 సెం.మీ, మందం గల కొమ్మల కత్తిరింపుల ద్వారా వ్యాప్తి చేయవచ్చు. ఎకరానికి 160 కాండం ముక్కలు కావాలి. ఏక వార్షికాలను  విత్తనాల ద్వారా వ్యాప్తి చెందించవచ్చు. (250గ్రా. ఎకరాకు చొప్పున) గింజలను నేరుగా పొలంలో విత్తుకోవాలి లేదా పాలిథీన్ సంచుల్లో విత్తి 15-20 సెం.మీ. ఎత్తు పెరిగిన తర్వాత పొలంలో నాటుకోవచ్చు.

**అంతరకృషి :** మొక్కలు 75 సెం.మీ. ఎత్తు పెరగగానే వాటి చివర్లు తుంచి వేస్తే ప్రక్క కొమ్మలు వచ్చి కాపు ఎక్కువగా వస్తుంది. ప్రక్క కొమ్మలు కూడా 2 అడుగుల లోపే తుంచి వేస్తే మొక్కలు గుబురుగా పెరిగి ఎక్కువ పూత, కాత వచ్చే అవకాశముంది. ఫిబ్రవరి-మార్చిలో కాయలు కోసిన తర్వాత చెట్టును ఒక మీ. ఎత్తు వరకు కత్తిరించి, రెండో పంటకు పైన తెలిపిన మోతాదులో ఎరువు వేసి నీరు పెట్టాలి. ఏకవార్షిక రకాల నుండి ఈ విధముగా 3 సం॥ వరకు పంటను  తీసుకోవచ్చు.

మునగలో అంతర పంటలుగా అలసంద, బెండ, వంగ, గోరుచిక్కుడు, ఫ్రెంచి చిక్కుడు మొ॥ కూరగాయలను మరియు ఆకు కూరలను వేసుకోవచ్చు.

బహువార్షిక రకాలను ఒకసారి చెట్టు ఆకారం కోసం కత్తిరింపులు చేశాక తిరిగి 10-12 సం॥ వరకు ఎటువంటి కత్తిరింపు అవసరం లేదు.

**ఎరువులు :** గింజలు విత్తిన 3 నెలలకు ఒక్కొక్క గుంటకు 100 గ్రా. యూరియా, 50 గ్రా. మ్యూరేట్ ఆప్ పొటాష్ వేసి నీటిని ఇవ్వాలి. మొక్కలకు ఆరు నెలలకు ఒకసారి, 9 నెలలకు మళ్ళీ ఒకసారి 100 గ్రా. యూరియా+50గ్రా. మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను వేసి నీరు కట్టాలి.

**నీటి యాజమాన్యం :** విత్తనాలు మొలకెత్తే వరకు ప్రతి 3 రోజులకు నీటితడి ఇవ్వాలి. తర్వాత 10-15 రోజులకు ఒకసారి నీటితడి ఇవ్వాలి. వరుసల మధ్య అంతర పంటలుగా అలసంద, బెండ, వంగ, ఫ్రెంచి చిక్కుడు వంటి పంటలను వేసుకోవచ్చు.

**సస్యరక్షణ :** చిన్న గొంగళి పురుగులు గుంపులు గుంపులుగా కాండంపై చేరి పత్రహరితాన్ని గీకి తింటాయి. పెద్ద పురుగులు ఆకులన్నీ తిని ఈనెలను మిగులుస్తాయి. నివారణకు లీటరు నీటికి కొరాజెన్ లేదా రైనాక్సిపైర్ 0.3 మి.లీ. కలిపి పురుగులు చిన్నవిగా వున్న దశలో పిచికారి చేయాలి.

**కాయతొలుచు ఈగ :** కాయతొలుచు ఈగ పూత దశ నుండి పిందె దశలో కాయలోనికి ప్రవేశించి, లోపలి పదార్థాన్ని తిని నాశనం చేయడం వల్ల కాయల ఆకారం మారిపోయి వంకరగా అవుతాయి. కాయ తొలుచు ఈగ నివారణకు పూత దశలో లీటరు నీటికి ఫాసలోన్ 2 మి.లీ. కలిపి పిచికారి చేయాలి. పిందె దశలో లీటరు నీటికి డైక్లోరోవాస్‌ను 1 మి.లీ. కలిపి మరల పిచికారి చేయాలి. అవసరమైతే మరోసారి 25 రోజులకు పిచికారి చేయాలి.

**వేరుకుళ్ళు, కాండం కుళ్ళు :** వర్షాకాలంలో మురుగునీరు పోయే సౌకర్యం లేని నేలల్లో ఎక్కువగా ఆశిస్తుంది. కాండం చుట్టూ వున్న బెరడు కుళ్ళిపోయి, చెట్టు విరిగి పోతుంది. వేర్లు కూడా కుళ్ళిపోయి చెట్టు చనిపోతుంది. నివారణకు మొక్కల మొదలు వద్ద 1 గ్రా. కార్బండజిమ్ లేదా 3 గ్రా. డైథేన్ యం-45 ఒక లీటరు నీటికి కలిపిన ద్రావణం కాని లేదా 1 శాతం బోర్డోమిశ్రమంగాని ముంపుగా తడపాలి. మొక్క మొదలు వద్ద మురుగు నీరు నిలువకుండా జాగ్రత్త తీసుకోవాలి. ప్రతి చెట్టు మొదలులో ట్రైకోడెర్మా విరిడే (2 కిలోలు/ఎకరాకు) కలిపిన పశువుల ఎరువును 5 కిలోలు చొప్పున వేయాలి.

**కోతకోయటం :** బహువార్షిక రకాలు నాటిన 8-9 నెలలకు కాపుకు వస్తాయి. మొదటి పంట మార్చి-జూన్ నెలలో, రెండవ పంట సెప్టెంబర్-అక్టోబరు నెలల్లో వస్తుంది. పంట పెరిగినపుడు మొక్కకు ప్రతి సంవత్సరానికి 500-600 కాయల వరకు దిగుబడి వస్తుంది. ఏకవార్షిక మునగ రకాలు గింజలు విత్తిన 6 నెలలకే కాపుకొస్తాయి (ఫిబ్రవరిలో) రకాన్ని బట్టి ప్రతి మొక్కకు మొదటి సంవత్సరం 150-200 కాయలు, రెండవ సంవత్సరం 250-400 కాయల దిగుబడి వస్తుంది. కాయలు కోసిన తర్వాత, ఒక మీటరు ఎత్తులో కొమ్మలను కత్తిరించి కార్శి పంటను తీసుకోవచ్చు. ప్రతి కత్తిరింపుకు పైన చెప్పినట్లు ఎరువులను వాడాలి. బహువార్షిక రకాలను ఒకసారి చెట్టు ఆకారంలో కత్తిరింపు చేశాక తిరిగి 10-12 సంవత్సరాల వరకు ఎటువంటి కత్తిరింపు అవసరం లేదు. ఆ తర్వాత తోటలో కొత్త మొక్కలను నాటుకోవాలి.

ప్రతి సం॥ ఒక్కో మొక్కకు 25-30 కిలోల పశువుల ఎరువు వేసి, రసాయనిక ఎరువులు పైన చెప్పిన మోతాదులో వేసి సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే ప్రతి సంవత్సరం మంచి దిగుబడులు పొందవచ్చు.


మునగ సాగుపై మరిన్ని వివరాలకు సంప్రదించవలసిన చిరునామా

**సీనియర్ సైంటిస్ట్ (హార్టికల్చర్) మరియు హెడ్, కూరగాయల పరిశోధనా స్థానం,**

రాజేంద్రనగర్, హైదరాబాద్. ఫోన్: 040-24018016